# స్పెయిన్, పోర్చుగల ట్రావెలాగ్

## – మల్లాది వెంకట కృష్ణమూర్తి



*(గత సంచిక తరువాయి)*

**మలాగాలోని** మా స్థానిక గైడ్ ఆనా దీపక్‌కి ఫోన్ చేసి తను ఎక్కడుందో చెప్పింది. ఆమె బస్సెక్కాక దీపక్ ఆమెని అందరికీ పరిచయం చేసాడు.




”వెల్‌కం టు మలాగా. యూరప్‌లోని ప్రతీ ఊరుకీ ఓ అందం ఉంటుంది. 2,8000 ఏళ్ళుగా మనుషులు నివశిస్తున్న మలాగా యూరప్‌లోని అతి ప్రాచీన నగరాల్లో ఒకటి. క్రీస్తు పూర్వం 770లో ఫోనిషియన్స్ మలక పేరుతో దీన్ని నిర్మించారు. రోమన్స్, తర్వాత మూరిష్ సుల్తానులు, ఆ తర్వాత స్పానిష్ రాజులు పాలించిన మలాగా నేడు పర్యాటకుల ఫేవరెట్. మలాగా నగరం ఓపెన్ మ్యూజియం. ఇది మెడిటరేనియన్ సముద్ర తీరంలో కోస్టా డెల్ సోల్ (కోస్ట్ ఆఫ్ ది సన్) తీరంలో, ఆఫ్రికా ఖండానికి 130 కిలోమీటర్ల దూరంలో ఉంది. 1487లో మూడు నెలల పదకొండు రోజుల యుద్ధం తర్వాత ఫెర్డినాండ్ తన క్రిస్టియన్స్ సైనికులతో దీన్ని ముస్లిమ్స్ నించి గెలుచుకున్నాడు.




”నేటి జనాభా సుమారు ఆరు లక్షలు. పర్యాటకంతోపాటు, కన్‌స్ట్రక్షన్, టెక్నాలజీ ఇక్కడి ప్రధాన పరిశ్రమలు. ఇక్కడో టెక్ వెబ్ పార్క్ ఉంది. ఇది స్పెయిన్‌లోని నాలుగో పెద్ద ఇండస్ట్రియలైజ్డ్ నగరం. ద్రాక్ష, ఫిగ్స్, బాదం, దానిమ్మతోటలున్నాయి. మీది షుమారు రెండు గంటల ఓరియెంటేషన్ టూర్ మాత్రమే. కానీ కనీసం రెండు రోజులుండి చూడదగ్గ నగరం మలాగా. ముఖ్యంగా ఇక్కడి పికాసో మ్యూజియం ఆర్ట్ లవర్స్‌ని ఆకర్షిస్తుంది. ప్రపంచ ప్రసిద్ధి చెందిన చిత్రకారుడు పాబ్లో పికాసో పుట్టిన ఊరిది. ఆయన 1885లో పుట్టాడు. తన బొమ్మలు తన జన్మస్థలంలోనే ఉండాలని కోరుకున్నాడు. కాబట్టి ఆ

మ్యూజియంలో ఆయన గీసిన 285 చిత్రాలని చూడచ్చు. మీరు మరోసారి వచ్చినప్పుడు ఈ మ్యూజియాన్ని మిస్ అవకండి. ఈ మ్యూజియం వివరంగా చూడటానికి కనీసం ఐదారు గంటలు పడుతుంది. ఆయన పుట్టిన ఇంట్లోనే 1988లో ఈ మ్యూజియాన్ని ఏర్పరిచారు.

"చాలామంది చిత్రకారుల్లా పికాసో కూడా మెడిటరేనియన్ సీ తీరంలోని ఫ్రెంచ్ రివేరియాలో స్థిరపడ్డాడు. అక్కడి పికాసో ఇంటిని 2 కోట్ల 40 లక్షల అమెరికన్ డాలర్స్‌కి సరిపడే యూరోలకి న్యూజిలాండ్‌కి చెందిన ఫైనాన్షియర్ రేయో విథనేజ్ అనే అతను కొన్నాడు. 1961 నించి 1973లో తన 91 ఏట మరణించేదాకా పికాసో ఆ ఇంట్లోనే నివశించాడు. ఆయన భార్య జాక్వెలిన్ రోక్ 1986లో మరణించే దాకా ఆ ఇంట్లోనే నివశించింది. పికాసో ఉన్నప్పటి ఆ ఇంట్లో ఆవిడ దేన్నీ మార్చలేదు. పికాసో తన కళ్ళజోడు ఎక్కడ పెట్టాడో అక్కడే ఉంది. 8 ఎకరాల్లో 13,000 చదరపు అడుగుల్లో ఉన్న ఈ ఇంటికి టెన్నిస్ కోర్ట్, స్విమింగ్ పూల్, జిమ్, స్పా, గెస్ట్ హౌస్, కేర్ టేకర్స్ కాటేజ్, పికాసో స్వయంగా డిజైన్ చేసిన తోట ఉన్నాయి. మొదట దీన్ని బ్రోకర్ హాన్స్‌బిన్ హుస్సేన్ 2 కోట్ల 22 లక్షల డాలర్లకి ఆక్షన్‌లో కొన్నాడు. ఫ్రెంచ్ లా ప్రకారం ఆ తర్వాతి పధ్నాలుగు రోజుల్లో ఎవరైనా ఎక్కువ పాడి కొనచ్చు. అది కనీసం పది శాతం అధికంగా ఉండాలి. విథనేజ్ ఎక్కువకి పాడి దీన్ని కొన్నాడు. అఫ్‌కోర్స్. ఇదంతా పికాసోకి, ఫ్రాన్స్‌కి సంబంధించింది" ఆనా నవ్వింది.

మా బస్ నెమ్మదిగా వెళ్తోంది. సముద్రపు ఒడ్డున చాలా హై రైజ్ బిల్డింగ్స్ కనిపించాయి.

"మలాగా పోర్ట్ అంతర్జాతీయ సీ పోర్ట్. మెడిటరేనియన్ తీరంలోని ఇది స్పెయిన్‌లోని అతి పురాతనమైన, ఇంకా ఉపయోగంలో ఉన్న ఓడరేవు. క్రీస్తు పూర్వం 1000వ సంవత్సరం నించి ఈ ఓడరేవు పనిచేస్తోంది. ఆ కాలంలో రోమ్‌కి ప్రధానంగా వైన్, ఆలివ్ ఆయిల్, బాదంపప్పు, లోహాలు, కుండలు ఈ పోర్ట్ నించి ఎగుమతి చేసేవారు. 15వ శతాబ్దంలో ఇది నస్రిద్ పాలికులకి ప్రధాన ఓడరేవుగా పని చేసేది. ఇక్కడ నించి క్రూజ్ షిప్స్, చేపల పడవలు వెళ్తూంటాయి. 1910లో దీన్ని ఆధునీకరించారు. క్రూజ్ కోసం వచ్చే పర్యాటకుల కోసం ఓడరేవులో రెస్టరెంట్స్, షాపింగ్ మాల్స్ నడుస్తున్నాయి." ఆనా చెప్పింది.

మా కోచ్‌లోంచి కనిపించే ఓ కోటని చూపించి చెప్పింది.

"అది మలాగాలోని ప్రధాన పర్యాటక కేంద్రం. క్రీస్తు శకం పదినించి పదిహేనవ శతాబ్దం దాకా హమ్‌దిద్ మూర్ రాజులు అల్కాజబా అనే ఈ పెద్ద కోటని ఇక్కడ నగరం మధ్యలోని కొండ మీద నిర్మించారు. అల్కాజబా అంటే అరబిక్ భాషలో 'చుట్టూ గోడలు కల కోట' అని అర్థం. దీని చుట్టూ మూడు ప్రహరీ గోడలు నిర్మించారు. ప్రస్థుతం రెండే మిగిలాయి. ఒకటి కొండ చుట్టూ, రెండోది కోట చుట్టూ. సిరియా, గ్రనడా మరో పది చోట్ల మూర్స్ ఇదే రకం కోటలని నిర్మించారు. ఇది పూర్తవడానికి ఐదు వందలయేళ్ళు పట్టింది. దీని చరిత్ర, సౌందర్యం పర్యాటకులని ఆకర్షిస్తోంది. దీని ప్రవేశద్వారం పక్కనే 1వ శతాబ్దానికి చెందిన రోమన్ థియేటర్ శిధిలాలు ఉన్నాయి. మూరిష్ రాజులు దాన్ని పడగొట్టి ఆ రాళ్ళతో ఈ కోటని నిర్మించారు. జిబ్రాల్‌ఫరో అనే మరో కోట దీనికన్నా ఎత్తులో ఉండి, దీనికో కారిడార్‌తో కనెక్ట్ చేయబడింది. శత్రు సైనికులు లోపలకి వేగంగా రాకుండా చాలా


సిటీ స్క్వేర్ లోని మాన్యుమెంట్

కోటల్లోలా ఈ కోట ప్రవేశద్వారం కూడా ఎస్ ఆకారంలో మలుపు తిరిగి ఉండి రెండు వైపులా తలుపులున్నాయి. కోటలో ఫౌంటెన్లు, ఒకప్పుడు ఛాపెల్ ఉన్న చోట నేడు టవర్ ఆఫ్ క్రైస్ట్ ఉన్నాయి. పైకి లిఫ్ట్ సౌకర్యం ఉంది. అల్కాజబా ఫోర్ట్ నించి పోర్ట్ కనిపిస్తూంటుంది.

తర్వాత మా కోచ్ కెథడ్రిల్ ఆఫ్ అవర్ లేడీ ఆఫ్ ఇన్‌కార్నేషన్‌కి చేరుకుంది. మేము కోచ్ దిగి ఆనాని అనుసరించాం. దాని బయట ఆమె చెప్పింది.

"దీని టైమింగ్స్ ఉదయం పదినించి సాయంత్రం ఆరుదాకా. మీరు లేటయ్యారు కాబట్టి లోపలకి వెళ్ళలేరు. (ఎంట్రన్స్ టికెట్ ఐదు యూరోలు) ఒకప్పుడు దీని చుట్టూ ముస్లిమ్స్ నిర్మించిన గోడలు ఇప్పుడు లేవు. దీన్ని 1528 - 1782 మధ్య దీర్ఘ చతురస్రాకారంలో నిర్మించారు. ఆ రోజుల్లో మలాగా పోర్ట్‌కి వచ్చిన ఓడల మీద వాటి బరువుని బట్టి ఎక్సైజ్ డ్యూటీని వసూలు చేసేవారు. ఆ డబ్బుతో ఈ కెథడ్రిల్‌ని నిర్మించారు. అప్పుడే స్వతంత్రం వచ్చిన అమెరికాతో వ్యాపారం ముమ్మరంగా సాగడంతో చాలా పెద్ద మొత్తం వసూలయ్యేది. మిగిలిన డబ్బుని రోడ్ల నిర్మాణం, మంచినీళ్ళ సౌకర్యాలకి ఖర్చు చేసారు. మూడు ఆర్చెస్ గల దీని బయటి భాగం బరోక్ స్టైల్‌లో నిర్మించారు. దీనికి మరో పేరు లా మాంక్విద. అంటే ఒక్క చెయ్యి మహిళ అనర్థం. దీని ఉత్తర టవర్ ఎత్తు టవర్ ఎత్తు 276 అడుగులు. దక్షిణ టవర్ పూర్తి కాలేదు. అందువల్ల దీనికి 'ఒన్ ఆర్మ్‌డ్ లేడి' టవర్ అనే ముద్దు పేరు వచ్చింది. లోపల 1785లో చెక్కిన అవర్ లేడీ ఆఫ్ ఇన్‌కార్నేషన్ విగ్రహం ఉంది. పాలరాతి స్థంభాలు, మహాగని, సిడర్ ఉడ్‌వర్క్ రాతి చెక్కడాలతో లోపల అద్భుతంగా ఉంటుంది. మలాగా పేట్రన్ సెయింట్స్, సిరియాకస్, సెయింట్ పౌలా ఛాపెల్స్, ఇతర సెయింట్స్ విగ్రహాలు ఆ నాటి శిల్పుల పనితనాన్ని చాటుతాయి. గతంలో ఇందులో ధనవంతులకి తలో ఛాపెల్ చొప్పున పదిహేడు ఛాపెల్స్ ఉండేవి. ఇప్పుడవి లేవు. కేవలం ఆల్టర్ మాత్రమే ఉంది."

మేము ఆ కెథడ్రిల్ బయటనించి ఫోటోలు తీసుకుని బస్సెక్కాం.

"ఇక్కడి రెండు కెథడ్రిల్స్‌లో రెండో కెథడ్రిల్ మూరిష్ అంటే ముస్లిం పరిపాలకులు నిర్మించిన జిబ్రాల్‌ఫరో అనే దాదాపు శిథిలమైన కెథడ్రిల్. 1487లో క్వీన్ ఇసబెల్లా ముస్లిమ్స్ నించి దీన్ని గెలుచుకున్నాక, అప్పటికి 800 ఏళ్ళక్రితం ముస్లిమ్స్ కట్టిన మసీదుని పడగొట్టించి ఈ కెథడ్రిల్‌ని నిర్మించింది. బెస్ట్ ఆఫ్ మలాగా గైడెడ్ టూర్‌కి 36 యూరోలు. పికాసో మ్యూజియం గైడెడ్ టూర్‌కి 75 యూరోలు. మలాగాలో ఇంకా ఆటోమొబైల్ మ్యూజియం, బొటానికల్ గార్డెన్స్ కూడా ఉన్నాయి."

రెండు గంటల్లో ఆ టూర్ పూర్తయ్యాక ఆనా మాకు గుడ్ బై చెప్పి ఓ చోట దిగిపోయింది. నేను కిందకి దిగి ఆమెకి ఐదు యూరోలు టిప్‌గా ఇచ్చాను. థాంక్స్ చెప్పింది. మా కోచ్ గ్రనడా వైపు సాగింది.

గంటన్నర తర్వాత మా కోచ్ గ్రనడాని సమీపిస్తూండగా దీపక్ మైక్‌లో చెప్పాడు.

"మన హోటల్‌కి వెళ్ళే దారిలోనే ఇండియన్ రెస్టరెంట్ ఉంది. భోజనం చేసాక హోటల్‌కి చేరుకుందామా? లేక ముందు హోటల్‌కి వెళ్దామా? మీ నిర్ణయం ప్రకారం రెస్టరెంట్ వారికి ఫోన్ చేసి మనం వచ్చే టైం చెప్తాను."

అంతా ముందు డిన్నర్ చేద్దామని చెప్పడంతో మా కోచ్ రాత్రి 8.40కి తాజ్ మహల్ తందూరి రెస్టరెంట్ ముందు ఆగింది. అది నార్త్ ఇండియన్ హోటల్. మెన్యూ ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఈ టూర్‌లో గతంలో మేం తిన్నలాంటి ఐటమ్సే వండారు. డిజర్ట్‌గా గులాబ్ జామ్ ఇచ్చారు. అన్నం సరిగ్గా ఉండక పోవడంతో జయదేవ్ సరిగ్గా అన్నం కూడా పెట్టడం లేదని

దీపక్‌కి ఫిర్యాదు చేసాడు. రాత్రి తొమ్మిదిన్నరకి బయలుదేరి గ్రనడా సిటీ సెంటర్లోని హోటల్ అబాడెస్ రికారోగిడాస్‌కి చేరుకున్నాం. దారిలో దీపక్ చెప్పాడు.

"రేపు మీకు వేకప్ కాల్ ఏడుకి. బ్రేక్‌ఫాస్ట్ ఎనిమిదికి. తొమ్మిదికల్లా అంతా బస్‌లో ఉండాలి."

బస్ హోటల్‌కి చేరుకున్నాక మా సామాను దింపుకుని లోపలకి వెళ్ళేసరికి దీపక్ మా గదుల తాళం చెవులు తీసుకుని ఎవరివి వారికి ఇచ్చాడు. ఆ ఐదంతస్తుల హోటల్‌లో మా రూం నంబర్ 309. అలసటగా ఉన్నా కొద్దిసేపు బయట నడిచాం. యూరోపియన్ రోడ్లు నడక ప్రియులని ఆకర్షించేలా ఉంటాయి. హోటల్ బయట పేవ్‌మెంట్ మీద కేవలం సిమెంట్ చేయలేదు. ఇళ్ళల్లోలా తెలుపు నలుపు గ్రనేట్ రాళ్ళ పలకలని పరిచారు.

**16-9-2015**

ఉదయం ఏడుకి అలారం మోగగానే పద్మజ ముందు లేచింది. తను తయారయ్యాక నన్ను లేపింది. ఉదయం ఎనిమిది ఐదుకి బ్రేక్‌ఫాస్ట్ హాల్‌కి వెళ్ళాం. కాంటినెంటల్ బ్రేక్‌ఫాస్ట్. ఇద్దరికీ నాలుగు బ్రెడ్ స్లైసెస్‌ని టోస్ట్ చేసాను. మిక్స్‌డ్ ఫ్రూట్ జామ్, ఆరెంజ్ మార్మలేడ్‌లతో తిన్నాం. ఆరెంజ్ జ్యూస్ తీసుకున్నాను. పద్మజ కాఫీ తాగింది.




తొమ్మిదవ లాబీకి చేరుకున్నాం. అంతా టైంకి వచ్చారు. మా గైడ్ అలెజాండ్రోని దీపక్ బస్‌లో అందరికీ పరిచయం చేసాడు. అతని భుజాన ఓ తోలు సంచి వేలాడుతోంది. అతను చేతులు జోడించి 'నమస్తే' అని చెప్పాడు. ఎవరూ బదులు పలకపోవడంతో మళ్ళీ 'నమస్తే' అని ఈసారి గట్టిగా చెప్పాడు.

"నమస్తే" మేమంత చెప్పాం.

ముందుగా అతను గ్రనడా గురించి వివరించాడు.

***గ్రనడా***

స్పెయిన్‌లో అండలూసియా ప్రాంతంలో, ఐబీరియన్ పెనున్సిలాకి దక్షిణ తీరంలో గ్రనడా ఉంది. ఇది చారిత్రాత్మక నగరం. క్రీస్తు పూర్వం రోమన్స్, 600 ఏళ్ళ క్రితం మూర్స్, ఆ తర్వాత క్రిస్టియన్ రాజులు దీన్ని పాలించారు. ఇది గ్రనడా ప్రావిన్స్‌కి రాజధాని. 11వ శతాబ్దంలో సియెరా నెవెడా పర్వత పాదంలో చుట్టూ గోడలతో గ్రనడా క్రమంగా నగరంగా అభివృద్ధి చెందింది. దారొ, జెనిల్, మొనాసిల్, బైరో అనే నాలుగు నదులు కలిసే చోట సముద్రతీరానికి గంట డ్రైవ్ దూరంలో ఈ నగరం ఉంది. దీన్ని మూర్స్, స్పానిష్ రాజులు పాలించారు. నేటి దీని జనాభా 2 లక్షల 30 వేలు. విస్తీర్ణం 88 చదరపు కిలోమీటర్లు. యూనివర్సిటీ ఆఫ్ గ్రనడాలో ఐదు కేంపస్‌లలో 82వేలమంది విద్యార్థులు చదువుతున్నారు. క్రీస్తుపూర్వం 5,500 నించి గ్రనడాలో ప్రజలు నివశిస్తున్నారు. క్రీస్తు శకం 711లో సౌత్ ఆఫ్రికా నించి వచ్చిన ముస్లింలు దీన్ని ఆక్రమించుకున్నారు. వారినే మూర్స్ అంటారు. గ్రనడా అరబిక్ పేరు. దీనర్థం హిల్ ఆఫ్ స్ట్రేంజర్స్.


11వ శతాబ్దంలో ఇది శక్తివంతమైన యూదుల నగరంగా ఉండేది. 1492దాకా దీన్ని ముస్లింలు పాలించారు. తర్వాత ఫెర్డినాండ్ -2, ఇసబెల్లా ఆఫ్ కేస్టిల్ వారిని తరిమికొట్టి దీన్ని ఆక్రమించారు. క్రీస్తు శకం 1500లో వారు స్థానిక ముస్లిమ్లని, యూదులని బలవంతంగా బాప్టైజ్ చేయడం ఆరంభించి, గ్రనడాలో ఉండాలంటే తప్పనిసరిగా క్రిస్టియానిటీ తీసుకోవాలనే కఠిన నియమం పెట్టారు. దాంతో తర్వాతి సంవత్సరం తిరుగుబాటు వచ్చింది. దాన్ని అణచివేయడంతో ముస్లిమ్స్ విధిలేక




బాప్టైజ్ అయ్యారు. లేదా సౌత్ ఆఫ్రికాకి వలస వెళ్ళిపోయారు. 16వ శతాబ్దానికల్లా నగరంలో మసీదులన్నీ చర్చ్‌లుగా మార్చబడటమో లేదా నాశనం చేయబడటమో జరిగింది.''

మా కోచ్ అల్‌హంబ్రా కోట వైపు వెళ్తూండగా అలజాండ్రో దారిలో ఆకోట గురించి వివరించాడు.

''అల్‌హంబ్రా అంటే అరబిక్‌లో ఎరుపు అన్నర్థం. వాటి బయటి గోడలు ఎరుపు రంగులో ఉండటంతో దీనికీ పేరు వచ్చింది. ఆ నాటి మూరిష్ రాజులు నిర్మించిన అల్‌హంబ్రా కోటలో తోటలు, అనేక భవంతులు, పేలస్‌లు నేటికీ చెక్కుచెదరకుండా ఉన్నాయి. 13-14వ శతబ్దాల్లో నిర్మించిన మూరిష్ రాజుల అధికారిక భవనం కూడా ఇందులోనే ఉంది. 1335-1354 మధ్య అల్‌హంబ్రా కోటని ముస్లిం సుల్తాన్లు మిలటరీ పర్పస్‌గా నిర్మించారు. దీని పొడుగు 2,430 అడుగులు, వెడల్పు 670 అడుగులు. దాన్ని ఫెర్డినాండ్ -2, రాణి ఇసబెల్లాలు గెలుచుకుని కొన్ని మార్పులు చేయడంతో అది రినైసెన్స్, ఇస్లామిక్ ఆర్కిటెక్చర్‌ల కలయికైంది. అల్‌హంబ్రా కోట, జనరలైఫ్ ప్లెషర్ పేలస్‌లో వనాలు, ఫౌంటెన్స్ ఎక్కువ. కారణం మూరిష్ రాజులు ఎడారి ప్రాంతం నించి వచ్చారు. వాళ్ళకి వ్యవసాయానికి చాలా తక్కువ నీరు లభ్యమయ్యేది. దాంతో నీటి చప్పుడు వినడం వారికి ఆనందంగా ఉండేది కాబట్టి చాలా ఫౌంటెన్స్‌ని, చెట్లని, మొక్కలని కోటలో ఏర్పాటు చేసారు. నీటిని వారు ఫర్టిలిటీ సింబల్‌గా భావించేవారు. సమీపంలోని సియెరాలో మంచు కరిగిన నీటిని కాలువల ద్వారా ఇక్కడికి రప్పించారు. ఇక్కడి కట్టడాలలో ఉపయోగించిన సేండ్ స్టోన్ గోడలు, సీలింగ్‌లలో శిల్పులు తేనె పట్టులా చిల్లులు చేసి అలంకరించారు. ఇది మూరిష్ శిల్పుల ప్రతిభకి ఉదాహరణ. ఈ రకం అలంకరణ ముస్లిమ్స్‌లో ఎక్కువ. అలాంటిది మీరిక్కడ చూస్తే ఆ భాగం స్పెయిన్ రాజులు కాక మూరిష్ రాజులు నిర్మించినదని అర్థం.



''13వ శతాబ్దంలో మొహమ్మద్ -1 అల్‌హంబ్రా కోట ఆవరణలో రాజుగారి పేలస్‌ని నిర్మించాడు. దాంతో అల్‌హంబ్రా కోటలోని పేలస్ నసిద్ సుల్తానులకి నివాసమైంది. 1238 - 1358 మధ్య వీటిలోని ఎక్కువ భాగాన్ని నిర్మించారు. నసిద్ డైనాస్టీని స్థాపించిన ఇబిన్ అల్ అహ్మద్, అతని వారసులు దీన్ని నిర్మించారు. అద్భుతమైన ఇంటీరియర్ డెకొరేషన్స్‌ని యూసఫ్ అనే ఆర్కిటెక్ట్ రూపొందించాడు. 1354లో ఇతను మరణించాడు. తర్వాత మొహమ్మద్ -3 కూడా ఇంకో పేలస్‌ని నిర్మించాడు. ఈ రోజు ఆ కాంప్లెక్స్ స్పెయిన్‌లోని ప్రధాన టూరిస్ట్ అట్రాక్షన్స్‌లో ఒకటి. ఉదయం 8.30 నించి రాత్రి 8 దాకా ప్రవేశం. మంగళ, బుధ, గురు, ఆదివారాలు మాత్రమే లోపలికి అనుమతిస్తారు. 1984లో ఈ కోటని యునెస్కో వరల్డ్ హెరిటేజ్ సైట్‌గా ప్రకటించింది. స్పెయిన్‌కి వచ్చే పర్యాటకులు అధికంగా సందర్శించే కోట ఇది.''

మా కోచ్ ఆ కోట ముందున్న విశాలమైన పార్కింగ్‌కి చేరుకుంది. ఇక్కడ  నాలుగు జోన్స్ ఉన్నాయి. మొదటి జోన్ బస్‌లు, కేరవాన్స్‌కి కేటాయించిన చోట మా కోచ్ ఆగింది. అలజాండ్రో బస్ దిగి తన వెంట రమ్మని కోరాడు.

"దాదాపు ఐదు గంటలు నడవాలి. నడవలేనివారు బస్‌లో కూర్చోవచ్చు. లేదా సమీపంలో చాలా రెస్టరెంట్స్ ఉన్నాయి" దీపక్ చెప్పాడు.

అంతా వచ్చారు. ఒకసారి 30 మందిని మాత్రమే లోపలకి అనుమతిస్తారు. కాబట్టి అలజాండ్రో అందరికీ టిక్కెట్స్ కొన్నాక కొంతసేపు వేచి ఉన్నాం. మా వంతు రాగానే అతను బేరియర్ దగ్గర నిలబడి ఒకొక్కరి టికెట్‌ని స్కేన్ చేసి ఒకరి తర్వాత మరొకర్ని లోపలకి పంపాక చివరగా వచ్చాడు. ఎంట్రన్స్ టికెట్ పన్నెండు యూరోలు. లోపల ముందుగా వాల్ మేప్‌ని చూపించి 35 ఎకరాల్లోని అందులో మేము ఎక్కడున్నామో, ఏమేం ఎక్కడున్నాయో, వాటిలో మేం ఏం చూస్తున్నామో అలజాండ్రో వివరించాడు.

ఈ పార్క్‌లోకి వెళ్ళే ఓ ప్రవేశద్వారం పేరు గేట్ ఆఫ్ పొమ్రగనేట్. ఈ గేట్ 16 వ శతాబ్దపు పెద్ద ఆర్చ్. ఈ గేట్‌లోనే అమెరికన్ రచయిత, డిప్లొమేట్ వాషింగ్టన్ ఇర్వింగ్ (1783 -1859) విగ్రహం ఉంది. ఆయన 150 వ వర్ధంతి సందర్భంగా 2009లో దీన్ని ఆవిష్కరించారు. ఆయన 1891లో రాసిన రిప్ వేన్ వింకిల్ ప్రసిద్ధి చెందింది. ఆయన టేల్స్ ఆఫ్ ది అల్‌హంబ్రా అనే పుస్తకం రాసాడు. దాని ద్వారా స్పెయిన్‌లోని అల్‌హంబ్రా, మూరిష్ చరిత్ర మీద చాలామందికి ఆసక్తిని కలిగించాడు. ఆయన జైదా, జొరైదా, జొరహైదా అనే ముగ్గురు మూరిష్ రాణుల గురించి రాసాడని అక్కడి ఓ ఫలకం మీద చదివాను. టవర్ ఆఫ్ జస్టిస్ నించి టవర్ ఆఫ్ ది హెడ్స్ ద్వారా 1554లో నిర్మించిన ఓ ఫౌంటెన్ పక్కనించి లోపలకి వెళ్ళాము. రకరకాల భవంతులు. ఒకదాంట్లోంచి మరో దాంట్లోకి వెళ్ళే దారిలో పచ్చని తోటలు. భవంతుల సముదాయం మధ్య కోర్ట్ యార్డ్‌లు, కొన్ని చోట్ల పెద్ద గదుల్లో కూడా ఫౌంటెన్లు ఉన్నాయి.

ప్రధాన ద్వారం పేరు గేట్ ఆఫ్ జడ్జ్‌మెంట్. గుర్రపునాడా ఆకారంలోని ఆర్క్‌వే గేట్‌ని దాటితే అక్కడే మూర్స్ న్యాయస్థానంగా ఉపయోగించిన చదరపు టవర్ ఉంది. ఇక్కడి అల్కజబా లేదా సిటాడెల్ మూరిష్ వారి పాత విభాగం. ప్రస్తుతం అక్కడ బయట పెద్ద గోడలు మాత్రమే మిగిలున్నాయి. అది దాటి లోపలకి వెళ్ళి అల్‌హంబ్రా పేలస్ చూసాం.

"అల్‌హంబ్రా అల్టా ఆ నాటి ప్రభుత్వ కార్యాలయం. అధికారులు, సభికులు ఇక్కడ పనిచేసేవారు. 1492లో ఫెర్డినాండ్ -2, ఇసబెల్లా మూర్స్‌ని గెలిచాక వాళ్ళే గ్రనడాని పాలించేవారని చెప్పాగా. ఇదో చారిత్రాత్మక ప్రదేశం. క్రిస్టఫర్ కొలంబస్ మనం ఉన్న కోటలోని సరిగ్గా ఈ సభకి వచ్చి పశ్చిమ నౌకాయానానికి సహాయం చేయమని కోరాడు. వారు అందుకు అంగీకరించారు. లేదా అమెరికా కనిపెట్టబడేదే కాదు. ఆ తర్వాత జరిగింది చరిత్ర" గైడ్ చెప్పాడు.

సరిగ్గా దీని మధ్యలో 116 అడుగుల పొడవు 66 అడుగుల వెడల్పు గల కోర్ట్ ఆఫ్ ది లయన్స్ చుట్టూ చక్కగా అలంకరించబడ్డ 124 తెల్లటి పాలరాతి స్థంభాలు ఉన్నాయి. సింహం బలానికి, ధైర్యానికి సూచనగా, 12 తెల్లటి పాలరాతి సింహం విగ్రహాలు గల ఫౌంటెన్ ఆఫ్ లయన్స్ ఉంది. ఫౌంటెన్ చుట్టూ అలబస్టర్‌తో చేసిన బేసిన్ ఉంది. ఎక్కడ చూసినా పచ్చటి చెట్లు, నీటి కాలువలు, ఫౌంటెన్స్‌తో, చక్కటి శిల్పసంపద గల భవంతులతో ఆ ప్రదేశం కంటికి చాలా ఆహ్లాదంగా ఉంది. 1537లో ఛార్లెస్ -5 ఇక్కడ ఓ కొత్త పేలస్‌ని నిర్మించాడు. ప్రస్థుతం అందులో ఫైన్ ఆర్ట్స్, అల్ హంబ్రా మ్యూజియాలు ఉన్నాయి.

ఒకో భవంతిలోంచి బయట ఫౌంటెన్స్ గల తోటలోకి, అక్కడ నించి మరో భవంతిలోకి మేము గౌడ్ వెంట నడుస్తూ చూడసాగాము. పేలస్ బయట ఉన్న పార్క్ పేరు అల్ మెజా దలా అల్ హంబ్రా. మూర్స్ నాటిన గులాబీలు, ఆరెంజ్‌లు, మిడ్జెల్ చెట్లు ఈ రోజుకీ అలాగే మెయిన్‌టైన్ చేస్తున్నారు. ఓ చోట ఎవరూ రాకుండా చుట్టూ ఇనప రైలింగ్ పెట్టుకుని వర్కర్స్ రిపేర్స్ చేస్తూ కనిపించారు. సేండ్‌స్టోన్ గోడల మీద, తలుపుల మీద చక్కటి ఆర్ట్‌ని చెక్కారు. చిన్న కాలువలోకి రెండువైపుల నించి ఫౌంటెన్స్‌లోంచి నీళ్ళు పడుతున్నాయి. అక్కడున్న పురాతన భవంతులన్నీ ఎర్రటి పెంకులు కప్పినవే. చాలాచోట్ల నీళ్ళ టేంక్స్ ఉన్నాయి. రాతి స్థంభాల మీద అన్నిచోట్లా డిజైన్స్‌ని అద్భుతంగా చెక్కారు. చెక్క తలుపుల మీద కూడా తాళ్ళు పేనినట్లు, నవారు బిగించినట్లుగా డిజైన్స్ నైపుణ్యంగా చెక్కారు.



37 చదరపు అడుగుల విస్తీర్ణం, 75 అడుగుల ఎత్తుగల అతి పెద్ద హాల్ ఆఫ్ ది అంబాసిడర్స్ పైన సీలింగ్ మధ్యలో ఓ డోమ్. ఆ హాల్ మధ్యలో ఓ ఫౌంటెన్ ఉంది.

"ప్రవేశద్వారానికి ఎదురుగా సుల్తాన్ సింహాసనం ఉండేది. దీన్ని మూర్స్ సభాస్థలిగా ఉపయోగించేవారు. చూడండి. సీలింగ్‌ని నీలం, బ్రౌన్, ఎరుపు, బంగారు రంగు రాళ్ళతో అలంకరించారు. దీన్ని హాల్ ఆఫ్ ది టు సిస్టర్స్ అని కూడా అంటారు. కారణం ఇక్కడ రెండు పాలరాతి అరుగులు ఉండటమే. వాటి మీద ఇద్దరు రాయల్ సిస్టర్స్ కూర్చునేవారుట. ఆఖరి సుల్తాన్ బోద్దే స్థానిక తెగల నాయకులని ఇక్కడికి ఆహ్వానించి వారందర్నీ చంపేసాడు. దీని సీలింగ్ డోమ్‌ని చూడండి. రాతిలో తేనెపట్టులా 5,000 చిల్లులు చేసి అలంకరించారు. చెప్పాగా. ఇది మూరిష్ శిల్పుల ప్రతిభకి ఉదాహరణ. ఈ అలంకరణని బట్టి ఇది ముస్లిం కాలంనాటిదని గ్రహించచ్చు."

"టవర్ ఆఫ్ ది ప్రిన్సెస్‌ని 1393 -1394 మధ్య సుల్తాన్ మొహ్మద్ -7 నిర్మించాడు. ఈ టవర్ బయట నించి అట్టహాసంగా లేకపోయినా లోపల సంపన్నమైన ఆర్కిటెక్చర్ అలంకరణతో ఉంది. ఇందులోని ఇంటీరియర్ నస్రిద్ ఆర్కిటెక్చర్‌కి మంచి ఉదాహరణ." అలజాంద్రో చెప్పాడు.

తూర్పు వైపు హిల్ ఆఫ్ ది సన్ మీద 14 వ శతాబ్దంలో నిర్మించిన సమ్మర్ పేలస్‌కి చేరుకున్నాం

"సమ్మర్ పేలస్ పేరు హెనోరాయికా. అరబిక్ పదాలు హలాహలాబి నించి ఈ పేరు వచ్చింది. అర్థం గార్డెన్ ఆఫ్ పేరడైజ్. దీనికి పేరు పెట్టడానికి కారణం చెట్లు, ఫౌంటెన్స్, నీటి శబ్దాలు. ఎడారి నించి వచ్చిన ఆ నాటి మూర్లకి స్వర్గం అంటే చెట్లు, నీళ్ళే. దీన్ని గార్డెన్ ఆఫ్ ది ఆర్కిటెక్ట్ అని కూడా అంటారు. టెర్రెస్ గార్డెన్స్, సరస్సులు, ఫౌంటెన్స్ గల ఇక్కడి కోర్ట్‌ని కోర్ట్ ఆఫ్ ది ఇరిగేషన్ ఛానల్ అంటారు. మొత్తం వివరంగా చూడటానికి కనీసం రెండు రోజులు పడుతుంది" గైడ్ చెప్పాడు.



జనరల్ లైఫ్‌లో అంతర్జాతీయ నృత్య, సంగీత ప్రదర్శనలు ఇచ్చే థియేటర్ ఉంది. అక్కడి భవంతులన్నిటికీ పెంకుల కప్పులే ఉన్నాయి. అన్నిటిలోకి అద్భుతమైన అల్‌హంబ్రా పేలస్‌ని, శిల్పుల అద్భుత నైపుణ్యాని నేను మరెక్కడా చూడలేదు. ఆ భవంతుల సముదాయంలో ఒకో భవంతిలోకి గైడ్ వెంట చాలా గంటలు నడుస్తూనే ఉన్నాం. ఆ అద్భుత సౌందర్యం, శిల్పకళ అలసటని తెలీనివ్వలేదు. ఎటు చూసినా ఆకుపచ్చటి మొక్కలు, చెట్లు.

"1492లో మూర్స్‌ని వెళ్ళగొట్టాక ఇక్కడి ఇంటీరియర్‌ని తుడిచేసి ఫర్నిచర్‌ని తొలగించడం లేదా నాశనం చేయడం చేసారు. 1516 - 156 మధ్య స్పెయిన్‌ని పాలించిన ఛార్లెస్ -ఆ అల్‌హంబ్రాలో నాశనమైన భాగాలని రినైసెన్స్ స్టైల్‌లో తిరిగి పునర్‌నిర్మించాడు. 1526లో ఇటాలియన్ పెడ్రో అనే ఆర్కిటెక్ట్ ఇక్కడ పనిచేసాడు. 1812లో వచ్చిన భూకంపం వల్ల ఈ కాంప్లెక్స్‌కి మరి కొంత నష్టం వాటిల్లింది. ఫెర్డినాండ్ -7 దీన్ని తిరిగి మరమ్మత్తులు చేయించాడు. 1839లో జోస్ కాంప్రారాస్, అతని మరణానంతరం, 1847లో అతని కొడుకు రాఫెల్, మరో 40 సంవత్సరాల పాటు మరమ్మత్తులు, పునర్‌నిర్మాణాన్ని కొనసాగించరు. 1890లో రఫెల్ మరణానంతరం అతని కొడుకు మేరియానో కాంటెరస్ గ్రంజా 1912లో మరణించేదాకా దీన్ని కొనసాగించాడు. 21వ శతాబ్దంలో కూడా దీని నిర్మాణం కొనసాగింది" అలజాండ్రో చెప్పాడు.

సేండ్ స్టోన్, ప్లాస్టర్లని రిపేర్ చేసే నిపుణులు అక్కడక్కడ కనిపించారు. బయటకి మూడింటికి వచ్చాం. అతను మా దగ్గర శెలవు తీసుకుని వెళ్ళిపోయాడు. నా బడ్జెట్‌లో గైడ్స్‌కి టిప్స్ ఇవ్వాల్సిన అవసరం లేకపోయినా అది కూడా ఉంటుంది. అతనికో ఐదు యూరోల నోటుని కరచాలనం చేసి థాంక్స్ చెప్తూ ఇచ్చాను. సాధారణంగా వారు అదనపు ఆదాయం కోసం గైడ్స్‌గా పని చేస్తూంటారు. ఎక్కువభాగం పర్యాటకులు టిప్ ఇవ్వరు. ఎదురు చూడకుండా లభించే ఆ టిప్ వారికి చాలా ఆనందాన్నిస్తుందని నేను గమనించాను.

బయటకి వచ్చాక జయదేవ్ చెప్పాడు.

"మా మైసూర్ మహారాజా పేలస్ కూడా చాలా బావుంటుంది. కాని ఇంత గ్రాండ్‌గా ఉండదు. మొఘల్స్, యూరోపియన్ రాజులు శిల్ప, చిత్ర కళలని బాగా పోషించేవారు. ఇండియాలో మనకి మొఘల్స్ నిర్మించిన భవంతులు చాలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడుల్లో ఇలాంటి గ్రాండ్ పేలస్‌లు కనపడవు."

"తెలంగాణ మొదటి నించి బీదప్రాంతం. గోల్కొండ కోటని సరిగ్గా పరిరక్షించలేదు. ఆ నాటి రాజులు గుళ్ళు, గోపురాలని నిర్మించారు. తమిళనాడులో కుంభకోణం ప్రాంతంలోని గుళ్ళు చాలా పాతవి." పద్మజ చెప్పింది.

లేట్ లంచ్ బదులు ఎర్లీ డిన్నర్ చేద్దామని చాలామంది చెప్పడంతో కోచ్‌లో చాలామంది తమ వెంట తెచ్చుకున్న స్నాక్స్ తిన్నారు. ఈవినింగ్ ఫ్రీ టైం. ఆ రాత్రి ఏడుకి తాజ్ మహల్ హోటల్‌కి డిన్నర్‌కి చేరుకున్నాం. రోటీ, అన్నం, గోబీ

మంచూరియా, పాలక్ పన్నీర్, గోభీ, ఆలూ కర్రీ, కడి, వెజ్ సలాడ్, అప్పడం, పెరుగు గులాబ్ జామ్. ఎనిమిదింపావుకి తిరిగి హోటల్‌కి కోచ్‌లో చేరుకున్నాం.

ఆ రోజంతా నడకతో అలసిపోవడంతో తొమ్మిదిన్నరకల్లా పడుకున్నాం.

***(కొనసాగింపు వచ్చేనెలలో)***

Post your comments

www.anandbooks.com
www.telugubooks.in
***ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి***